క్లుప్తంగా

వలంటీర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

గుడివాడరూరల్: మండలంలోని పలు గ్రామాల్లో వలంటీర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ కె.జ్యోతి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆమె మాట్లాడుతూ.. మండలంలోని బిళ్లపాడు(క్లస్టర్ సి1), లింగవరం(క్లస్టర్ సి1), శేరీగొల్వేపల్లి(గుంటాకోడూరు క్లస్టర్ సి10) మూడు పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఈ నెల 20వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని, 21వ తేదీన దరఖాస్తుల పరిశీలన, 22వ తేదీ ఉదయం మండల సెలక్షన్ కమిటీ వారిచే ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. 22వ తేదీ మధ్యాహ్నం ఎంపికైన అభ్యర్థులకు నియామకపత్రాలు అందజేయడం, 23న సీఎఫ్ఎంఎస్ ఐడీ క్రియేట్ చేయటం, అదే రోజు మధ్యాహ్నం నుంచి శిక్షణ ఇస్తామని చెప్పారు. అర్హులందరూ తమ దరఖాస్తులను ఆయా సచివాలయ కార్యదర్శులకు అందజేయాలని ఎంపీడీఓ కోరారు.

శ్యామలాంబ తల్లికి విశేష పూజలు

కైకలూరు: మాఘమాస నవరాత్రుల సందర్భంగా కైకలూరు శ్యామలాంబతల్లి వాస్య మాతంగిగా భక్తులకు గురువారం దర్శనమిచ్చారు. ప్రముఖ న్యాయవాది తెలగంశెట్టి శ్రీనివాసరావు ఉభయ పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ వీఎన్‌కే శేఖర్ మాట్లాడుతూ శుక్రవారం రథసప్తమి సందర్భంగా శ్యామలాంబ, మీసాల వేంకటేశ్వరస్వామి దేవస్థానాల్లో లంకా ఫణికుమార్ శర్మచే సూర్య నమస్కారాల ప్రత్యేక పూజ, హోమాది కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనాలని కోరారు.

సచివాలయాల కార్యదర్శి రమణకు సత్కారం



పమిడిముక్కల: ఢిల్లీలో జరిగిన గణతంత్ర వేడుకల్లో ఉత్తమ పంచాయతీ కార్యదర్శిగా అవార్డు పొందిన చోరగుడి, గురజాడ, అలీనఖీపాలెం గ్రామ సచివాలయాల కార్యదర్శి రమణను గురువారం అలీనఖీపాలెం సచివాలయంలో ఘనంగా సత్కరించారు. లంకపల్లి ఎంపీటీసీ మీర్జా సజ్జాద్ అలీ, కో ఆప్షన్ సభ్యుడు దియానత్ ఆలీ రమణను సత్కరించారు. రమణ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు తోట్లవల్లూరు గ్రామ సచివాలయం ప్రారంభం



తోట్లవల్లూరు: తోట్లవల్లూరు -1 గ్రామ సచివాలయం ప్రారంభానికి ముస్తాబైంది. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం పక్కనే రూ.43.60 లక్షలతో నూతన భవన నిర్మాణం జరిగింది. నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ శుక్రవారం ప్రారంభిస్తారని సర్పంచ్ పెనుమత్స రాధిక తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని సర్పంచ్ కోరారు.

నేడు నీటి సరఫరాకు అంతరాయం

గుడివాడటౌన్: పురపాలక సంఘ పరిధిలో శుక్రవారం తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద ఎరికపాడు వద్ద విద్యుత్ స్తంభాలు ఏర్పాటు సమయంలో ప్రధాన పైప్‌లైన్ దెబ్బతినడంతో శాంతినగర్, గుడ్‌మెన్ పేట, ఎన్టీఆర్ కాలనీ, బంటుమిల్లి రోడ్డులోని రిజర్వాయర్లకు నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. దీంతో 3వ వార్డు నుంచి 24వ వార్డు పరిధిలో గల ప్రాంతాలకు నీటి సరఫరాను నిలిపి వేస్తామన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

రోడ్డు ప్రమాదాలపై అప్రమత్తత అవసరం

గుడివాడటౌన్(నందివాడ): విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ నిబంధనల పట్ల అవగాహన కలిగి ఉంటే భవిష్యత్‌లో రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని నందివాడ ఎస్‌ఐ ఎస్.చంటిబాబు అన్నారు. జనార్దనపురం ఎంపీపీ స్కూల్‌లో చిన్నారులకు రోడ్డు భద్రత అనే అంశంపై గురువారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం అనేక రకాల వేగవంతమైన వాహనాలు అందుబాటులోకి వస్తున్నాయన్నారు. నిబంధనలు పాటించకపోతే వాటి వల్ల ప్రమాదాలు జరుగుతాయన్నారు. విద్యార్థి దశ నుంచే నిబంధనల పట్ల అవగాహన పెంచుకోవాలని ఆయన సూచించారు.

గ్రామాల సంపూర్ణ అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్



జుఝవరంలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, నాయకులు

జుఝవరం(పామర్రు): ప్రతి గ్రామాన్ని సంపూర్ణ అభివృద్ధి చేయాలన్న సత్ సంకల్పంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటోందని పామర్రు శాసనసభ్యుడు కైలే అనిల్‌కుమార్ అన్నారు. మండల పరిధి జుఝవరం గ్రామంలో కొత్తగా నిర్మించిన ఐదు సీసీ రహదారులను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కైలే మాట్లాడుతూ.. గ్రామాల్లో రహదారుల నిర్మాణం పనులను ప్రాధాన్యతా క్రమంలో చేపడుతూ అన్ని గ్రామాల్లో రహదారుల ఏర్పాటుకు తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రామంలో రూ.20 లక్షల నిధులతో సీసీ రహదారులు ఏర్పాటు చేశామని చెప్పారు. మురాల సరోజిని ఇంటి నుంచి పెద్దిబోయిన తులసీ దాసు ఇంటి వరకు 32 మీటర్లు రూ.5 లక్షలతో సీసీ రహదారి, పెద్దిబోయిన తులసీ దాసు ఇంటి నుంచి కొలుసు సుబ్బారావు ఇంటి వరకు 73 మీటర్లు రూ.5 లక్షలతో రహదారి ఏర్పాటు చేశామన్నారు. కొలుసు కోటేశ్వరరావు ఇంటి నుంచి జొన్నలగడ్డపోతురాజు ఇంటి వరకు 76 మీటర్లు రూ.4.20లక్షలతో, కొలుసు బసవయ్య ఇంటి నుంచి నార్ని వీరాస్వామి ఇంటి వరకు 51 మీటర్లు రూ.3.55 లక్షలతో, కొలుసు గోవిందరాజులు ఇంటి నుంచి నెరుసు రమేష్ ఇంటి వరకు 61 మీటర్లు రూ.2.25 లక్షలతో సీసీ రహదారులు నిర్మించామని చెప్పారు. రానున్న కాలంలో మిగిలిన అన్ని ప్రాంతాల్లో రహదారుల ఏర్పాటుకు తగు చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు

ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించడమే ముఖ్య ఉద్దేశంగా ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే కైలే అన్నారు. అర్హతే ప్రామాణికంగా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు. కుల, మత, ప్రాంత, పార్టీ అని బేధాలు లేకుండా అర్హత ఆధారంగా పథకాలు మంజూరు చేస్తున్నామని చెప్పారు. సంక్షేమ పథకాల సారధి అయిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని రానున్న కాలంలో ప్రజలు అందరూ తమ మద్దతు తెలిపి మరలా సీఎం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ పుట్టి పున్నమ్మ, పార్టీ నాయకులు పుట్టి కిషోర్, నవుడు సింహాచలం, పుట్టి రామ్మోహన్‌రావు, పెయ్యల రాజు, కుందేటి రాణి, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

కష్టపడితే జీవితంలో ఉన్నత స్థానం

కోనేరుసెంటర్: కృష్ణా విశ్వవిద్యాలయం రసాయన శాస్త్ర విభాగంలో కొత్తగా చేరిన విద్యార్థులకు స్వాగతం పలుకుతూ సీనియర్ విద్యార్థులు ఫ్రెషర్స్ డే వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ పీవీ బ్రహ్మచారి మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో ఉన్న విభాగాల్లో రసాయన శాస్త్ర విభాగానికి ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించుకోవడం ద్వారా విద్యార్థుల మధ్య స్నేహ భావం పెరుగుతుందన్నారు. సీనియర్ విద్యార్థులు జూనియర్లకు మార్గదర్శకులుగా ఉండాలని సూచించారు. విద్యాభ్యాసం అనంతరం ఇదే స్నేహ భావాన్ని విద్యార్థులు కొనసాగించుకోవాలని కోరారు. రాబోయే రోజుల్లో ఉద్యోగావకాశాల్లో ఒకరినొకరు సహకరించుకోవాలని తెలిపారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులు సాంకేతిక అంశాలపై పట్టు సాధిస్తే ఉద్యోగాలు పొందడం సులభం అవుతుందన్నారు. ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ వైకే సుందరకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు విషయ పరిజ్ఞానం పెంపొందించుకోవాలని తెలిపారు. రసాయన శాస్త్ర విభాగంలో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో నిర్మించిన పరిశోధనశాలలు ఉన్నాయని వాటిని విద్యార్థులు వినియోగించుకోవాలని చెప్పారు. పరిశోధనలలో భాగస్వాములు కావాలన్నారు. ఇటీవల విజయవాడ సిద్ధార్థ కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికలలో పాల్గొని ఉద్యోగావకాశాలు పొందిన విద్యార్థులను ఆయన అభినందించారు. రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ డి.రామశేఖర రెడ్డి మాట్లాడుతూ క్రమశిక్షణతో కష్టించి పనిచేయడం ద్వారా జీవితంలో ఉన్నత స్థానం పొందవచ్చన్నారు. త్వరలోనే విద్యార్థులకు ప్రాంగణ ఎంపికలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. యూనివర్సిటీలో రసాయన శాస్త్ర విభాగంలో నూతనంగా జాయిన్ అయిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో రసాయన శాస్త్ర అధ్యాపకులు పుష్పలత, రవి, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రూ.3 కోట్లతో రహదారుల ఆధునికీకరణ



నందివాడలో పనులు ప్రారంభిస్తున్న నాయకులు

గుడివాడటౌన్(నందివాడ): నందివాడ మండలానికి ప్రధాన రహదారి అయిన జనార్దనపురం - కుదరవల్లి రహదారి పునర్నిర్మాణం పనులకు గురువారం భూమిపూజ చేశారు. ఎంపీపీ పెయ్యల ఆదాం మాట్లాడుతూ.. 10 కిలోమీటర్ల మేరకు ఈ రోడ్డు విస్తరించి ఉందని కొన్ని ప్రాంతాల్లో గోతులు, మరికొన్ని చోట్ల రోడ్డు పూర్తిగా ధ్వంసమైన నేపథ్యంలో మరమ్మతులు, రోడ్ల నిర్మాణానికి రూ.3 కోట్లు మంజూరు అయ్యాయన్నారు. ఇప్పటికే గుడివాడ - పోలుకొండ రోడ్డును కోట్లాది రూపాయలు హెచ్చించి నిర్మాణం పూర్తి చేశామని చెప్పారు. ఈ పనులు కూడా పూర్తయితే మండలంలోని రోడ్లన్నీ సుందరంగా తయారవుతాయన్నారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఈఈ శ్రీనివాస్, డీఈ కామేశ్వరరావు, వైస్ ఎంపీపీ జయరాజు, నందివాడ సర్పంచ్ సరెళ్ల రత్నకుమారి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కొండపల్లి కుమార్‌రెడ్డి, సచివాలయాల ఇన్‌చార్జి దేశిరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, ఉప సర్పంచ్ చంద్రశేఖర్, నాయకులు ఎం.కృష్ణారెడ్డి, కె.రంగారెడ్డి, కందుల నాగరాజు, తోట నాగరాజు, సరెళ్ల నాగేశ్వరరావు, ఆర్అండ్‌బీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు ఫార్మసీలో ప్రాంగణ ఎంపికలు



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మణరావు

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు వీవీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మా స్యూటికల్ కళాశాలలో మెడి అసిస్ట్ టీపీఏ సీమెడి అసిస్టెంట్ బెంగళూరు వారు బీ ఫార్మసీ చివరి సంవత్సర విద్యార్థులకు ప్రాంగణ ఎంపికలను నిర్వహించారు. ఈ ఎంపికల్లో 20 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు గురువారం తెలిపారు. రెండు దఫాల్లో నిర్వహించిన ఈ ఎంపికల్లో మొదటి విడతలో గ్రూప్ డిస్కషన్, రెండో రౌండ్‌లో టెక్నికల్ ఇంటర్వ్యూ చేసినట్లు ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ వి.ఎల్.వినోద్‌కుమార్ పేర్కొన్నారు. ఈ ప్రాంగణ నియామకాలకు 55 మంది విద్యార్థులు హాజరు కాగా 20 మంది ఉత్తమ ప్రతిభను కనబరిచి ఉద్యోగాలు సాధించారన్నారు. ఎంపికైన 20 మంది ఇన్సూరెన్స్ క్లైమ్ ప్రాసెస్ ఎగ్జిక్యూటివ్ అర్హత సాధించారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

గుడ్లవల్లేరు విద్యార్థినికి జిల్లా స్థాయి అవార్డు



డీఈఓ తాహెరా సుల్తానా చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ప్రణతి

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు ఏఏఎన్ఎమ్ అండ్ వీవీఆర్ఎస్ఆర్ హైస్కూల్ 7వ తరగతి విద్యార్థిని ఎ.ప్రణతికి ఇన్‌స్పైర్ మనక్ జిల్లా స్థాయి అవార్డు వరించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ విషయాన్ని ఆ హైస్కూల్ డైరెక్టర్ నారాయణం శ్రీనివాసమూర్తి గురువారం విలేకరులకు తెలిపారు. విజయవాడలో బుధవారం జరిగిన జిల్లా స్థాయి సైన్స్ ప్రదర్శనలో తలపడిన 106 మందిలో ఎంపికైన 11 మందిలో విజేత ప్రణతికి డీఈఓ తెహరా సుల్తానా చేతుల మీదుగా అందించినట్లు పేర్కొన్నారు. విజేతతో పాటు శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయురాలు ఎ.జ్యోతిని హైస్కూల్ చైర్మన్ డాక్టర్ వల్లూరుపల్లి నాగేశ్వరరావు, కార్యదర్శి వల్లూరుపల్లి సత్యనారాయణ, సహ కార్యదర్శి వల్లూరుపల్లి రామకృష్ణ, డైరెక్టర్ శ్రీనివాసమూర్తి, హెచ్ఎమ్ మురళీకృష్ణ అభినందించారు.

24 నుంచి పోతురాజు స్వామి వార్షిక జాతర



ఆలయంలో కొలువైన శ్రీపోతురాజుస్వామి మూలవిరాట్

నాగాయలంక: గ్రామంలోని బోసుబొమ్మ సెంటర్‌లో కొలువై ఉన్న శ్రీపోతురాజుస్వామి వార్షిక జాతర మహోత్సవం ఈ నెల 24, 25 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు నిర్వాహక కమిటీ ప్రతినిధి ఉప్పల లీలాకృష్ణప్రసాద్(బుజ్జి) గురువారం తెలిపారు. 24వ తేదీ ఉదయం 8 గంటలకు కృష్ణానదిలో స్వామివారి ఘటం శుద్ధి పూజలు జరిపి జల్ది ఉంచుతారు. సాయంత్రం 5గంటలకు జల్దిలో నుంచి ఘటం తీసి రాత్రంతా గ్రామోత్సవం నిర్వహిస్తారు. 25న ఉదయం స్వామివారి ఘటము గుడికి చేరుకోవడంతో 9 గంటలకు సంప్రదాయక గుడిజాతర (సంబరం) గుంటూరు జిల్లా పల్నాటి ఆచారవంతులచే ఆరంభం అవుతుంది. ఆ తర్వాత భక్తుల మొక్కుబడులు, చద్ది నైవేద్యాల సమర్పణ ఉంటాయి. దాతల ఆర్థిక సౌజన్యంతో జాతరకు వచ్చిన భక్తులందరికీ అన్నసంతర్పణ నిర్వహిస్తారు.

19న బహిరంగ వేలం

ముదినేపల్లిరూరల్: మండలంలోని అల్లూరు జెడ్పీహైస్కూల్‌లో శిథిలావస్థకు చేరిన భవనాన్ని తొలగించి శిథిలాలను తరలించేందుకు ఈ నెల 19వ తేదీన బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ గంగాధరరావు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు రూ.3,200 ధరావత్తుగా చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు. వేలం సొమ్ము పూర్తిగా చెల్లించిన తరువాత శిథిలాలను తొలగించి తరలించాలని చెప్పారు.

రుద్రపాకలో జూదరుల అరెస్ట్

గుడివాడటౌన్(నందివాడ): మండలంలోని రుద్రపాక గ్రామంలో పేకాట స్థావరంపై గురువారం దాడి చేశామని ఎస్ఐ ఎస్. చంటిబాబు తెలిపారు. పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.1300 నగదు స్వాధీనపర్చుకున్నామన్నారు. నిందితులను శుక్రవారం కోర్టుకు తరలిస్తామని ఎస్ఐ తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

తహసీల్దార్ సుభాని బాధ్యతల స్వీకరణ



మండవల్లి: మండవల్లి తహసీల్దార్‌గా జె.సుభాని గురువారం బాధ్యతలు స్వీకరించారు. తాడేపల్లి సీసీఆర్ఏ నుంచి ఆయన ఇక్కడకు బదిలీ అయ్యారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా డీటీ కె.గోపాల్ వ్యవహరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సుభాని మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

నేడు ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

మండవల్లి: రథ సప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం మండవల్లిలో కొలువై ఉన్న శ్రీ అభయాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఈఓ కొవ్వాడ దివ్యశ్రీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వామివారికి సహస్ర తమలపాకుల అర్చన, గంధసిందూర పూజ, కోలాటం, భజనలు తదితర పూజా కార్యక్రమాలను దేవదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని, పూజల్లో పాల్గొనాలని కోరారు.

భావనారుషి సంబరాలు

పెడన: పట్టణంలోని పద్మశాలీ బహోత్తమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక 2వ వార్డులో వేంచేసి ఉన్న భద్రావతి సమేత భావనారుషి స్వామి వార్ల కల్యాణ మహోత్సవ సంబరాలు గురువారం ఉదయం ప్రారంభమయ్యాయి. రెండు రోజులు పాటు నిర్వహించే ఈ సంబరాల్లో భాగంగా మొదటి రోజు వేకువ జామున గణపతి పూజతో ప్రారంభించి ప్రత్యేక పూజలు పుణ్యాహం, పంచగవ్యం, రక్షా బంధనపూజ, అఖండ స్థాపన, ప్రధాన కలశస్థాపన, స్నపన హోమాలు, ఆన కట్టుట నిర్వహించారు. మధ్యాహ్నం కుమారకం (మేళతాళాలతో ఊరేగింపుగా నృత్యాలు చేసుకుంటూ వెళ్లి బొట్టు పెట్టి స్వామి వారి కల్యాణానికి రావాలని పిలుపులు), సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి 10 గంటల తరువాత స్వామివార్లను అత్యంత వైభవంగా ఊరేగించారు. శుక్రవారం విశేష పూజలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

ఉచితంగా కంప్యూటర్ శిక్షణ



ప్రారంభ కార్యక్రమంలో శిక్షణాంశాలు వివరిస్తున్న అసిస్ట్ ప్రతినిధి దుర్గ

ఎదురుమొండి(నాగాయలంక): అవనిగడ్డలోని కంప్యూటర్ సంస్థ సైబర్ జోన్ ఆధ్వర్యంలో దీవుల్లోని అసిస్ట్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆర్థిక సహకారంతో ఎదురుమొండి దీవిలోని లక్ష్మీపురం, యేసుపురం, కృష్ణాపురం, ఎదురుమొండి గ్రామాల్లో ఉచిత వృత్తి విద్యా శిక్షణ గురువారం ప్రారంభించారు. అసిస్ట్ డెప్యూటీ డైరెక్టర్ ఎం.రామారావు మాట్లాడుతూ ఈ ఉచిత శిక్షణలో భాగంగా మూడు నెలలు పాటు కంప్యూటర్ పరిజ్ఞానంపై సంపూర్ణ అవగాహన కలిగిస్తారని పేర్కొన్నారు. సైబర్‌జోన్ ప్రతినిధి బీసాబత్తుని కృష్ణలీల మాట్లాడుతూ 30 మందికి ఎంఎస్ ఆఫీస్, డీటీపీ, ట్యాలీ తదితర కంప్యూటర్ అంశాలపై శిక్షణ ఇస్తామన్నారు. సంస్థ ఏరియా కో ఆర్డినేటర్ డి.వెంకట్రావు, దుర్గ, గ్రామ సమాఖ్య సభ్యులు, సైబర్ జోన్ యోగేష్, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

గర్భిణుల పౌష్టికాహారానికి ఆర్థిక సహకారం



గర్భిణులకు నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే కొడాలి నాని

గుడివాడటౌన్: స్థానిక మెయిన్ రోడ్డులోని దేవదాయ, ధర్మదాయ శాఖకు చెందిన శ్రీ అహింసా సాంప్రదాయ సేవా హాస్పిటల్‌లో గురువారం గర్భిణులకు పౌష్టికాహారానికి ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) అందజేశారు. తొలుత సేవా హాస్పిటల్ వ్యవస్థాపకుడు గూడూరు రామచంద్రరావు చిత్రపటానికి ఎమ్మెల్యే కొడాలి నాని పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ.. వందేళ్ల క్రితమే మహిళ బిడ్డకు జన్మనివ్వాలంటే తల్లికి ఆరోగ్యం ఎంతో అవసరమని అది ఒక పునర్జన్మ వంటిదని రామచంద్రరావు గుర్తించి ఈ సేవా కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఒక్కొక్క మహిళకు రూ.1000 చొప్పున 206 మంది మహిళలకు ఆర్థిక సహాయాన్ని పంపిణీ చేశామని చెప్పారు. ఇదే విధంగా మహిళల ఆరోగ్యం విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారన్నారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ ఈఓలు ఉయ్యూరు సుధాకర్, నటరాజన్ షణ్ముగం, కె.సురేష్, కేవీ గోపాలరావు, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి హనుమంతరావు, మెరుగుమాల కాళీ, మాదాసు వెంకట లక్ష్మీకుమారి, చందరాల హరిరాంబాబు, పద్మావతి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ పాలనలో గ్రామాల అభివృద్ధి

ఎమ్మెల్యే డీఎన్నార్



మిలట్రీపేటలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్, నాయకులు

కైకలూరు: వైఎస్సార్ సీపీ పాలనలో గ్రామాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) చెప్పారు. కలిదిండి పంచాయతీలో కోట కలిదిండి వద్ద రూ.35 లక్షలు, మిలట్రీపేట వద్ద రూ.29.74 లక్షల పంచాయతీ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్లు పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డీఎన్నార్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో రహదారుల నిర్మాణాన్ని చేపట్టామన్నారు. గత పాలనలో ఎన్నడూ లేని అభివృద్ధి కార్యక్రమాలు నియోజకవర్గంలో జరిగాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, సర్పంచ్ మసిముక్కు మారుతీప్రసన్న, ఏఎంసీ చైర్మన్ కొల్లాటి సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు తిరుమాని రమేష్, వైస్ ఎంపీపీ కూసంపూడి కనకదుర్గారాణి, ఎంపీటీసీలు నీలి సుమన్, షఫాయితుల్లా, ఉప సర్పంచ్ మత్తిరెడ్డి సత్యనారాయణ, మండల సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు గద్దె ఆనంద్‌కుమార్, నాయకులు పాము రవికుమార్, కందుల వెంకటేశ్వరరావు, యాళ్ల జీవరత్నం, ఆకుల మురళి, పోతురాజుల లక్ష్మణ్, మారుబోయిన విష్ణు, మంగినేని భాస్కరరావు, చిట్టూరి భోగేశ్వరరావు, భట్రాజు ఏసుబాబు పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్

పెదసనగల్లు(మొవ్వ): ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తూ.. అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తూ.. జనం మెచ్చిన నాయకుడుగా రాష్ట్ర చరిత్రలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిలిచిపోయారని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం మొవ్వ మండలం పెదసనగల్లు గ్రామంలో ఎమ్మెల్యే కైలే అనిల్‌కూమార్ పార్టీ నాయకులు, అధికారులు, వలంటీర్లతో కలిసి పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి జగనన్న ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను, అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని తెలుసుకుంటూ.. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి ఏ మేరకు లబ్ధి చేకూరుతుందో తెలియజేశారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికై అధికారులకు సూచనలిస్తూ ముందుకు సాగారు.

సంక్షేమానికి చిరునామా..

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కైలే మాట్లాడుతూ.. నవరత్నాలతో పాటు మరెన్నో ప్రజా రంజక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సంక్షేమానికి చిరునామాగా మారిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కొండేటి ఇందిర, జెడ్పీటీసీ రాజులపాటి పార్వతి, సర్పంచ్ కైతేపల్లి అన్నామణి, పార్టీ మండల అధ్యక్షుడు రాజులపాటి రాఘవరావు, మండల సచివాలయ కన్వీనర్ సమ్మెట ఆంజనేయులు, ఉప సర్పంచ్ పామర్తి గోపాల్, నాయకులు కొడాలి మురళీ, కొలుసు రామ నరసింహారావు, మేరుగు శ్రీను, సభ కీర్తి, తాతా స్వప్న, చీకటిమర్ల శివరామ ప్రసాద్, పలు గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు వివిధ శాఖల అధికారులు, గృహ సారథులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పాఠశాలల వార్షికోత్సవాలు



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న హెచ్ఎం ఫణికుమార్, ఉపాధ్యాయుడు అబుసిబ్‌తైన్

ముదినేపల్లిరూరల్: మండలంలోని వడాలి జెడ్పీ హైస్కూల్ వార్షికోత్సవం గురువారం ఉత్సాహంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, జెడ్పీటీసీ ఈడే వెంకటేశ్వరమ్మ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు రూపుదిద్దుకున్నాయన్నారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో పాఠశాల విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించి జిల్లాస్థాయిలో గుర్తింపు తీసుకురావాలని సూచించారు. సీనియర్ ఉపాధ్యాయుడు సీహెచ్ నాగమల్లేశ్వరరావు ఆలపించిన గీతాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. సర్పంచ్ మరీదు దుర్గశ్రీ, ఎంపీటీసీ పల్లి శ్రీదేవి, ప్రధానోపాధ్యాయుడు వి.ప్రభుదాస్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ పల్లి ఉమామహేశ్వరి, మరీదు హనుమంతు, మర్రివాడ వీరరెడ్డి కిషోర్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా అగినపర్రు హైస్కూల్ వార్షికోత్సవం

పమిడిముక్కల: అగినపర్రు గాంధీజీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 55వ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం ఫణికుమార్ హైస్కూల్ ప్రగతిని వివరించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకొన్నాయి. చదువు, ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు సుధారాణి, రవికుమార్, రామాంజనేయులు, అబుసిబ్‌తైన్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ కోట మణిరాజు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ మట్టా నాగలక్ష్మి, తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సింధు స్నానాలపై రేపు సమీక్ష

కోడూరు: మాఘపౌర్ణమిని పురస్కరించుకొని హంసలదీవి సాగరతీరంలో జరిగే సింధు స్నానాలపై శనివారం ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ టి.శ్రీనివాసరావు గురువారం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బందరు ఆర్డీఓ వాణి అధ్యక్షతన మధ్యాహ్నం 3గంటలకు ఈ సమావేశం ఉంటుందన్నారు. హంసలదీవి వేణుగోపాలుడి కల్యాణోత్సవాలు, సింధు స్నానాలకు వచ్చే భక్తులకు చేయాల్సిన ఏర్పాట్లపై చర్చించనున్నట్లు చెప్పారు. అన్ని శాఖల అధికారులు ఈ సమావేశానికి విధిగా హాజరు కావాలని కోరారు.